పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

● ముషీరాబాద్‌లో 274 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి ● 147 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు ● దివ్యాంగులకు, వృద్ధులకు వీల్‌చైర్, వలంటీర్‌ల ఏర్పాటు



పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని తరలిస్తున్న ఎన్నికల సిబ్బంది



ఏవీ కళాశాలలో ఎన్నికల సామగ్రిని తరలించే సమయంలో బందోబస్తు నిర్వహిస్తున్న ఏసీపీ రమేష్‌కుమార్, సీఐ శ్రీనివాస్‌రెడ్డి

కవాడిగూడ, మే 12 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలో లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ముషీరాబాద్ నియోజకవర్గ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో ఉన్న 274 పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని కవాడిగూడ డివిజన్ గగన్‌మహల్ ఏవీ కళాశాల నుంచి ఆయా పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని పంపించినట్లు తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు పలు సూచనలు సలహాలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఆదివారం ఏవీ కళాశాల ఆవరణలో ఏఆర్‌ఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని ముషీరాబాద్ నియోజకవర్గంలో మొత్తం 274 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 3 లక్షల 7 వేల 556 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. 274 పోలింగ్ కేంద్రాలను 25 సెక్టార్లుగా విభజించి వాటి పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు ప్రతి పోలింగ్ కేంద్రానికి ఐదుగురు అధికారులను నియమించినట్లు ఆయన వెల్లడించారు. ముఖ్యంగా 66 లోకేషన్లలో 147 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, ఆయా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలతోపాటు మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. దివ్యాంగులు. వృద్ధులకు పోలింగ్ కేంద్రాల వద్ద ఒక వీల్‌చైర్, వలంటీర్‌లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెపారు. అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీసుబందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

బందోబస్తు చర్యలు

చిక్కడపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల సందర్భంగా భారీ బందోబస్తు చర్యలు చేపట్టినట్లు చిక్కడపల్లి ఏసీపీ, ఎన్నికల సబ్ నోడల్ అధికారి ఎల్. రమేష్‌బాబు తెలిపారు. ఆదివారం త్యాగరాయగానసభలో ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలీసు సిబ్బందికి ఆయన సూచనలు ఇచ్చారు. ఓటింగ్ కేంద్రాల వద్ద ఎలా బందోబస్తు నిర్వహించాలి, పోలింగ్ కేంద్రంవద్ద ఎలా వ్యవహరించాలి, ఓటర్లకు ఎలాంటి సహకారం అందించాలి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎలా అప్రమత్తంగా ఉండాలి, ఏదైనా సంఘటన జరిగితే ఎలా రియాక్ట్ కావాలి, సమస్యను ఎలా అప్పటికప్పుడు పరిష్కరించే యత్నం ఎలా చేయాలి వంటి వివరాలు సిబ్బందికి ఆయన తెలియజేశారు. ముఖ్యంగా ఓటింగ్‌కు వచ్చేవారు నిర్భయంగా తమ ఓటుహక్కు వినియోగించుకునేలా చూడాలని సూచించారు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య స్టేషన్ సిబ్బందితోపాటు అదనపు సిబ్బంది పాల్గొన్నారు. ఓటర్లు తమ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ఏసీపీ రమేష్‌బాబు అన్నారు.



లేబర్ కమిషనర్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాల తనిఖీ సందర్భంగా పోలీసులకు సూచనలిస్తున్న చిక్కడపల్లి పోలీసులు

అంబర్‌పేట నియోజకవర్గంలో

బర్కత్‌పుర,మే 12 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలో ఓటింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించడానికి అధికారులు విస్తృతమైన ఏర్పాట్లు చేశారు. అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన ఈవీఎంలను బర్కత్‌పుర రెడ్డి కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన విషయం విదితమే. ఆర్‌ఓ హేమంత్‌కుమార్ పాటిల్, ఏఆర్‌ఓలు అపర్ణ, మారుతీదివాకర్, వీరాబాయిలతో కలిసి ఈవీఎంల తరలింపును పర్యవేక్షించారు. ఆయా పోలింగ్ కేంద్రాలకు విస్తృతమైన బందోబస్తు నడుమ అధికారులు ఈవీఎంలను, సిబ్బందిని ఆదివారం సాయంత్రం తరలించారు.

అంబర్‌పేట నియోజకవర్గంలో 2 లక్షల 79 వేల 994 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో మహిళా ఓటరు ఒక లక్ష 38 వేల 375 మంది, పురుష ఓటర్లు ఒక లక్ష 41 వేల 607 మంది ఉన్నారు.

ఇతరులు 12 మంది ఉన్నారు. వీరిలో 60 వేల మంది మైనారిటీ ఓటర్లు ఉండగా 74 వేల 512 మంది యువ ఓటర్లు ఉన్నారు.



రెడ్డి కళాశాల నుంచి ఈవీఎంలను పోలింగ్ కేంద్రాలకు తరలిస్తున్న అధికారులు



శివపార్వతిని సన్మానిస్తున్న అతిథులు

భావితరాలకు సంప్రదాయ సంగీతాన్ని అందించాలి

చిక్కడపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): భావితరాలకు సంప్రదాయ సంగీతాన్ని అందించాలని, ఈ బాధ్యత గురువులు, తల్లిదండ్రులు తీసుకోవాలని ప్రముఖులు కోరారు. శ్యామ గాయత్రి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాయ గానసభలో శాస్త్రీయ సంగీత గురువు చిల్లా శివపార్వతి జన్మదిన పర్యవేక్షణలో ఆమె శిష్య బృందం గానం, నాట్య గురువు జ్యోతి శేఖర్ శిష్యురాలు గాయత్రి శేఖర్ కూచిపూడి నాట్య ప్రదర్శన జరిగింది. ముఖ్య అతిథిగా కళాపోషకుడు గుదిబండి వెంకటరెడ్డి పాల్గొని మాట్లాడుతూ శివపార్వతి ఎందరో ఔత్సాహికులకు సంప్రదాయ సంగీతం నేర్పిస్తూ వారిని ఉత్తమ గాయకులుగా సమాజానికి అందిస్తున్నారని అభినందించారు. శ్రీరామ సాంస్కృతిక సంస్థ స్థాపకుడు గొర్తి చంద్రశేఖర్, గాయకులు త్రినాథరావు తదితరులు పాల్గొని శివపార్వతిని సత్కరించగా, నర్తకి గాయత్రి శేఖర్‌కు అభినవ నాట్యమంజరి బిరుదు బహూకరించారు.



ఆలిండియా ప్రేయర్ పవర్ చర్చిల డైరెక్టర్ శ్యామ్ అబ్రహంను సన్మానిస్తున్న మురళీ మోజెస్

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనను అలవర్చుకోవాలి

ముషీరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనను అలవర్చుకున్నప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు మురళీ మోజెస్ అన్నారు. ఆదివారం ముషీరాబాద్ డివిజన్‌లోని రాంనగర్ ప్రేయర్ పవర్ చర్చిలో జరిగిన సామూహిక ప్రార్థనలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలిండియా ప్రేయర్ పవర్ చర్చిల డైరెక్టర్ శ్యామ్ అబ్రహంను సన్మానించి ఆయన చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు, ప్రజల్లో భక్తిభావం పెంపొందించేలా కృషి చేస్తున్నందుకు సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బైబిల్‌లోని దైవ వ్యాఖ్యలకు అనుగుణంగా నడుచుకున్నప్పుడు ప్రపంచ శాంతి నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయలక్ష్మి, భారతి తదితరులు పాల్గొన్నారు.



మల్కాజిగిరి ఆనంద్‌బాగ్‌లోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం స్వామివారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకులు ముడుంబై వేంకటరమణా చార్యులు, అర్చకులు తులసి రమణా చార్యుల ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ ఈఓ రవీందర్‌రెడ్డి పర్యవేక్షణలో కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. పలువురు భక్తులు పాల్గొన్నారు. - మల్కాజిగిరి, ఆంధ్రజ్యోతి

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

రాంనగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ లోక్‌సభకు జరుగుతున్న ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు తమ ఓటును వినియోగించుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ కోరారు. ఆదివారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ఎక్కడకు వెళ్లినా ప్రజలనుంచి విశేషస్పందన లభించిందన్నారు. ప్రజలు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకొని మంచి నాయకుడిని ఎన్నుకోవాలన్నారు.

ఓటు హక్కు మన బాధ్యత

చిక్కడపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): ఓటు మన హక్కు అని రాజ్యాంగం ప్రసాదించిన ఈ హక్కును వినియోగించుకోవడం మన బాధ్యత అని గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ అన్నారు. ఆదివారం సాయంత్రం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఓటర్లు తప్పకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేయాలని కోరారు. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలన్నా, మనం కోరుకునే అభివృద్ధి జరగాలన్నా ఓటు వేయాలన్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో



సమావేశంలో మాట్లాడుతున్న ముఠా గోపాల్

ఓటింగ్‌శాతం పెంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించి బాధ్యతగా తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

బాధ్యతాయుతంగా ఓటు వేయాలి

కవాడిగూడ, మే 12 (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్‌ను నిర్మించే పార్లమెంట్ ఎన్నికలలో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్క ఓటర్ బాధ్యతాయుతంగా ఓటింగ్‌లో పాల్గొనాలని ట్రస్మా ప్రధాన కార్యదర్శులు ఎస్ఎన్ రెడ్డి, రమేష్ పిలుపునిచ్చారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర ప్రైవేటు విద్యా సంస్థల సంఘం (ట్రస్మా) ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యా సంస్థలు యజమానులతో కలిసి వారు మాట్లాడుతూ అభివృద్ధి చెందిన ప్రపంచ దేశాలలో మన భారత దేశాన్ని అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలబడటానికి మంచి లక్షణాలు కలిగిన దేశభక్తి, కీర్తి ప్రతిష్టలు పెంపొందించే నాయకున్ని ఎన్నుకోవాలని అన్నారు. సమావేశంలో అధికార ప్రతినిధి చింతల రామచందర్, సలహాదారు ఎస్ఎమ్ రాంరెడ్డి, ప్రధాన సలహాదారు కడారి అనంతరెడ్డి, సలహాదారులు ఎస్ రాంరెడ్డి, కోశాధికారి శ్రీకాంత్‌రెడ్డి, చింతల రాంచందర్, రాష్ట్ర సంఘం, జిల్లా సంఘం మండల కమిటి నాయకులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి

ముషీరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): పద్మశాలి కాలనీలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు వేసే విధంగా తీర్మాణం చేశారు. ఆదివారం భోలక్‌పూర్ డివిజన్‌లోని పద్మశాలి కాలనీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కాలనీ వాసులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సొసైటీ ప్రధాన కార్యదర్శి ఆర్ ఆంజనేయులు మాట్లాడుతూ తమ కాలనీలోని 500ల కుటుంబాలను చైతన్య పరిచి ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా కృషి చేస్తున్నామన్నారు. సామాజిక బాధ్యతతో కాలనీ వాసులమంతా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.



బాగ్‌లింగంపల్లిలోని లంబాడీతండాలో మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో దివంగత మాజీ హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి జయంతిని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ సీనియర్ నేత ఎమ్మెన్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

-రాంనగర్, ఆంధ్రజ్యోతి

నాయిని నర్సింహారెడ్డి సేవలు మరువలేనివి

కవాడిగూడ , మే 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుడిగా, కార్మిక నాయకుడిగా, తెలంగాణ తొలి హోం మంత్రిగా నాయిని నర్సింహారెడ్డి రాష్ట్రానికి చేసిన సేవలు మరువలేనివని కవాడిగూడ డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు కాటారం దినేష్ కొనియాడారు. నాయిని నర్సింహారెడ్డి 90వ జయంతి సందర్భంగా ఆదివారం కవాడిగూడ వైస్రాయ్ చౌరస్తాలో బీఆర్ఎస్ నేతలు నాయిని నర్సింహారెడ్డి చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన సేవలు చిరస్మరణీయమైనవని అన్నారు. నాయిని ఆశయ సాధనకు నేటి యువత, బీఆర్ఎస్ నేతలు కృషి చేయాలని కాటారం దినేష్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజుయాదవ్, బల్లెకారి రాములు. శ్రీనివాస్, పాస్‌పోర్టు శ్రీనివాస్ నాయకులు కార్యకర్తలుపాల్గొన్నారు.



గుడిసెల్లో అక్రమంగా మద్యం విక్రయం

● ముగ్గురికి రిమాండ్

చంపాపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): మిధానీ డిపో సమీపంలో గుడిసెల్లో అక్రమంగా మద్య విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గుడిసెల్లో కిరాణాషాప్ నిర్వహిస్తున్న జ్యోతి(38) విక్రయానికి నిల్వ ఉంచిన రూ.80,190 విలువైన 72.90 లీటర్ల మద్యం, మరో మహిళ కేతావత్ జ్యోతి(35), నేనావత్ తిరుపతి(30) ఇంటి నుంచి రూ.3,412 విలువైన 13.65 లీటర్ల మద్యంను స్వాధీనం చేసుకున్నామని, వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

● ముగ్గురిపై కేసు

అల్లాపూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 622.08 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఓ పార్టీకి చెందిన ముగ్గురు పర్వత్‌నగర్ ప్రాంతంలో ఓ వైన్‌షాపులో మద్యం కొనుగోలు చేసి కూకట్‌పల్లి తరలిస్తున్నారు. కైతలాపూర్ బ్రిడ్జి వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు వాహనాన్ని తనిఖీ చేయగా కార్టన్లలో మద్యం సీసాలు ఉన్నాయి. ఆటోను, మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ వినయ్, అనిల్, సైదులుపై కేసు నమోదు చేశారు.



స్వాధీనం చేసుకున్న వాహనం, మద్యం కార్టన్లు

పుస్తకాల ఖని 'కోఠి'

తక్కువ ధరకే పాత, కొత్త పుస్తకాలు అందుబాటులో

● జీ మ్యాట్ నుంచి ఎంసెట్, పీజీ సెట్ ఎంట్రెన్స్ బుక్స్ వరకూ...
● 40 నుంచి 60 శాతం డిస్కౌంట్‌తో...
● కోఠిలోని సబ్‌వే, సుల్తాన్ బజార్, బ్యాంక్ స్ట్రీట్, ఆబిడ్స్, ప్రధాన రోడ్లపై..



ఆబిడ్స్ జీపీవో వద్ద పుస్తకాలు

> విద్య, ఉద్యోగాలు, పోటీ పరీక్షల కోసం కోటి ఆశలతో నగరానికి వచ్చే యువతకు ఆ ప్రాంతం దిక్సూచి. అక్కడ ప్రతి పుస్తకం తక్కువ ధరకే అందుబాటులో ఉంటుంది. ఇక్కడ ఫుట్‌పాత్‌లు, రోడ్డుకు ఇరువైపులా వందల సంఖ్యలో షాపులు ఉన్నాయి. వాటిల్లో పాత పుస్తకాలతోపాటు కొత్త పుస్తకాలు లభిస్తాయి. అందుకే వారికి 'కోఠి' విజ్ఞాన ఖనిలా మారింది.

మంగళ్‌హాట్, మే 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఆశలతో నగరానికి వచ్చి కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకుంటున్న పలువురు ఉద్యోగార్థులు కోఠికి వచ్చి వారికి నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడ ఇంజనీరింగ్, మెడిసిన్, టీఎస్‌పీఎస్సీ యూపీఎస్సీ సివిల్స్ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు 40 నుంచి 60 శాతం డిస్కౌంట్‌తో షాపులలో విక్రయిస్తుంటారు. దాంతో సెలవు రోజులు, ఆదివారం వచ్చిందంటే చాలు కోఠి ప్రధాన రహదారుల్లోని ఫుట్‌పాత్‌లు, బడ్డీ కొట్ల వద్ద పుస్తకాల కోసం విద్యావంతులు, విద్యార్థులు బారులు తీరుతున్నారు.

ఆదివారం, సెలవు రోజుల్లో....

రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, మారు మూల పల్లెల నుంచి నగరానికి వచ్చి హాస్టల్‌లో ఉంటూ పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న పలువురు విద్యార్థులు కోఠిలోని సబ్‌వే, సుల్తాన్ బజార్ రోడ్, ఆబిడ్స్ జీపీఓ ప్రధాన రహదారి, బ్యాంక్ స్ట్రీట్ తదితర ప్రాంతాల్లో ఉన్న షాపులకు వారికి అవసరమైనవి కొనుక్కుని వెళ్తున్నారు. ఇక్కడి షాపుల నిర్వాహకులు కొత్త పుస్తకాలను నేరుగా ప్రింటర్స్, పబ్లిషర్స్ నుంచి తీసుకురావడం వల్ల డిస్కౌంట్ కూడా అధికంగానే ఇస్తుంటారు. మరి కొంతమంది వ్యాపారులు కొద్ది రోజులపాటు పుస్తకాలను విద్యార్థులకు అద్దె (రెంట్)కు ఇస్తుంటారు. అందుకు వారు పూర్తి వివరాలతోపాటు కొంత మొత్తం నగదు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది.

ప్రతి పుస్తకం అందుబాటులో...

జీ మ్యాట్, క్యాట్, శాట్, ఎంసెట్, పీజీ సెట్, లాసెట్, జేఈఈ మెయిన్, జేఈఈ అడ్వాన్స్, ఎన్ఐఎఫ్‌టీ, నీట్, ఇంజనీరింగ్, ఏఐఐఎంఎస్, ఏఐఈఈడీ లాంటి పోటీ పరీక్షల పుస్తకాలతోపాటు ఐదారేళ్ల కిందటి ప్రశ్నపత్రాలు కూడా అందుబాటులో ఉంటాయి. ఐటీ, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్, ఎంటెక్, బీఎస్సీ, ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ, ఫార్మసీ, డిగ్రీ, మెడిసిన్, మెకానికల్, ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్, సివిల్ ఇంజనీరింగ్‌తోపాటు పీహెచ్‌డీ పుస్తకాలు సైతం తక్కువ ధరలో దొరుకుతుంటాయి. ప్రముఖ కవులు రచించిన నవలలు, సాహిత్య పుస్తకాలు, గ్రంథాలు, కవితా సంపుటాలు, ఇలా అన్ని రకాల పుస్తకాలుకు కోఠి పెట్టింది పేరు.

విజ్ఞానానికి పెద్దపీట...

విద్యా సంవత్సరం ఆరంభంలో జూన్, జులై, ఆగస్టు నెలల్లో విద్యార్థులు పుస్తకాలు తీసుకునేందుకు ఎక్కువగా కోఠికి వస్తుంటారు. వార్షిక, సప్లిమెంటరీ పరీక్షల సమయంలో విద్యార్థులు పుస్తకాలు, పాత్ర ప్రశ్నప్రతాలు కొనుగోలు చేస్తుంటారు. సాధారణ రోజులలో విద్యావంతులు, సాహితీ ప్రియులు విజ్ఞానాన్ని పెంచుకోవడానికి, మరికొంతమంది జనరల్ నాలెడ్జ్, ఇంగ్లిష్, సైన్స్‌కు సంబంధించిన పుస్తకాలు కొనుగులు చేస్తుంటారని వ్యాపారులు చెబుతున్నారు. అలాంటి వారి కోసం ప్రత్యేకంగా పబ్లిషర్స్ నుంచి తెప్పించి ఇస్తుంటామని, అందుకు ఎక్కువ ధర చెల్లించాల్సి ఉంటుందన్నారు.



కోఠి ప్రధాన రహదారిలో పుస్తకాల అమ్మకాలు


పాత పుస్తకాలు తిరిగి ఇక్కడికే...

పుస్తకాలు కొన్న తరువాత తమ అవసరం తీరిన వారు తిరిగి అవి ఇతరులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో మళ్లీ ఇక్కడి షాపుల వారికే అమ్మేస్తుంటారు. ముఖ్యంగా విద్యార్థులు తమ విద్యా సంవత్సరం పూర్తై వెళ్లిపోయే సమయంలో వాటిని ఎంతో కొంతకు వ్యాపారులకు ఇచ్చేస్తుంటారు.

మెండుగా ఆదాయం...

పాత పుస్తకాల దుఖాణదారులకు ఆదాయం మెండుగా ఉంటుంది. రోజు వేలల్లో వ్యాపారం సాగుతుందని, ముఖ్యంగా సెలవుదినమైన ఆదివారం రూ.10 వేల నుంచి 20 వేల వరకు వ్యాపారం జరుగుతుందని ఓ వ్యాపారి తెలిపారు.

సీజన్‌లో కాస్త లాభం ఉంటుంది



కోఠి ప్రధాన రహదారి ఫుట్‌పాత్‌పై పుస్తకాల దుకాణాలకు అనుమతి ఉన్న సమయంలో మంచి వ్యాపారం సాగేది. సబ్‌వేకు మార్చిన తరువాత తగ్గింది. సీజన్‌లో మాత్రం రద్దీ అధికంగా ఉంటుంది. విద్యార్థులతోపాటు ప్రముఖులు వస్తుంటారు. ప్రముఖ రచయితల పుస్తకాల కోసం వచ్చిన సమయంలో పబ్లిషర్స్ నుంచి తెప్పించి ఇచ్చేందుకు ప్రయత్నిస్తుంటాం.

- అబ్దుల్(పుస్తకాల వ్యాపారి)

రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడి మృతి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మే 12 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మరణించాడు. ఈ సంఘటన సీతాఫల్‌మండి రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. సీతాఫల్‌మండి - మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌ల మధ్యలో ఆదివారం సాయంత్రం 4.30 గంటల సమయంలో గుర్తుతెలియని 75 ఏళ్ల వ్యక్తి రైలు ఢీకొని తీవ్ర గాయాలతో కంకరాళ్ల వద్ద అపస్మారక స్థితిలో పడిపోయి ఉన్నట్లు స్థానికుల సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వృద్ధుడిని వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా అదే రోజు 5.50 గంటలకు చికిత్స పొందుతూ మరణించాడు. మృతదేహాన్ని గాంధీ మార్చురికి తరలించారు. వ్యక్తి ఆచూకి తెలిస్తే వెంటనే సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన భరతనాట్య ప్రదర్శన

బంజారాహిల్స్, మే 12 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ శిల్పారామంలో ఆదివారం కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు అలరించాయి. చెన్నై నుంచి విచ్చేసిన భరతనాట్య కళాకారిణి రక్షా దేవనాదన్ నట్టైకురంజి రాగం వర్ణం, జయదేవ అష్టపది అంశాలను ప్రదర్శించి మెప్పించారు. కూచిపూడి నటి గురువర్యులు చూడామణి తన శిష్య బృందంచే మూషిక వాహన, పలుకే బంగారమాయే, అలరింపు, పుష్పాంజలి, నటేశకౌతం, జతిస్వరం, బ్రహ్మాంజలి, జయజనార్దన, ఆనంద తాండవం, మాతృ దినోత్సవం సందర్భంగా "అమ్మ" నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. దీక్ష, అద్వితి, నయోనికా, లాస్య, లక్ష, సమన్విత, హెత్విక అద్భుతంగా నృత్య ప్రదర్శన చేశారు.